కథా నిలయం
3647
శ్రీకాకుళం

# తోడు

సుందర్రావు నీరసంగా ఇంటికొచ్చాడు. ఉసూరుమంటూ కుర్చీలో కూలబడ్డాడు.

"ఏవిటండీ అలా ఉన్నారు? ఏమైంది?" అడిగింది సుశీల.

కాఫీ గ్లాసు అందుకుంటూ కోపంగా "నీ వల్లే" అన్నాడు.

"ఇది మరీ బావుంది. ఆఫీసులో ఏదో అయితే ఆ కోపం నా మీద చూపిస్తున్నట్టున్నారు" అని మూతి ముడుచుకుని, లోపలికెళ్ళి పోవడమా, తనూ కుర్చీలో కూర్చోడమా అన్న ఆలోచనలో పడి అలాగే నిలుచుండి పోయింది సుశీల.

కాఫీ చప్పరిస్తూ సుందర్రావు సుశీలను చూశాడు.

సుశీల ఖరీదయిన చీర కట్టి ముస్తాబై ఉంది. మెరిసిపోతున్న సుశీలను చూశాక గుర్తొచ్చింది ఇవేళ సినిమాకెళ్దామని పొద్దున అన్నమాట.

"నీకు సినిమాలూ, సరదాలూ తప్ప పనికొచ్చేవేవీ పట్టవు!"

"అవును మరి, రోజుకో సినిమా చూపించి వారానికో చీర కొంటున్నారుగా!"

సుశీల వెటకారం చూసేటప్పటికి సుందర్రావుకు మరీ ఒళ్ళు మండిపోయింది.

"మాటకు మాట అనడం మాత్రం బాగా తెలుసు. ఈ తెలివి అన్నింటిలోనూ ఉంటే ఇలా జరిగుండేది కాదు."

"ఇప్పుడు నేనేమన్నాననీ? ఇంతకీ ఏం జరిగిందేవిటి?"

"మా నాన్న మన దగ్గరుండడానికి వీలు లేదన్నావుగా?"

"అవ్వ! అలా నేనెప్పుడన్నానూ?"

"వేరే అనాలా? ఆయనొస్తే పుట్టింటికెళ్ళిపోయి, ఆయన వెళ్ళేదాకా తిరిగొచ్చే దానివి కావు. ఇప్పుడు చూడు ఆయనేంచేశారో!"

"ఏం చేశారేవిటి? ఎవర్నన్నా పెంచుకున్నారా? కొడుకుండగా దత్తత చెల్లదు లెండి!"

"గొప్ప ప్లీడరు బయల్దేరింది" చిరాకు పడి, "మనకు చిల్లిగవ్వకూడా దక్కకుండా చేశారు' అన్నాడు సుందర్రావు.

"చెప్పేదేదో సరిగా చెప్పండి"

"ఏం చెప్పను? నీ పుణ్యమా అని ఆయన ఇంకో పెళ్ళి చేసుకున్నారు."

సుందర్రావు మాట విన్న సుశీల నిర్ఘాంతపోయింది. ఆమె నోటంట మాట రాలేదు. కాస్సేపటికి తేరుకుంది. ముందు ముందు కూడా మామగారు తమ ఇంటికి వచ్చి తిష్ఠవేసే ప్రమాదం తప్పిందని ఆమె లోలోపల కొంత సంతోషించింది. కానీ, మామగారు మళ్ళీ పెళ్ళి చేసుకోవడం వల్ల ఆయన అనంతరం రావలసిన ఆస్తి అంత సులువుగా రాదన్న విషయం స్ఫురించాక సుశీల డీలా పడిపోయింది.

"ఇప్పుడెలా?" అంది చిన్నగా. "చేసింది చేశాక ఇప్పుడెలా అంటే లాభమేముంది? నేను మావూరు వెళ్ళొస్తాను. బట్టలు సర్దు" అని సుందర్రావు బాత్‌రూమ్‌కు నడుస్తూ "బుజ్జిగాడు కన్పించడేం?" అన్నాడు.

"పక్కింట్లో పిల్లలతో ఆడుకుంటున్నాడు" అంది సుశీల బెడ్‌రూమ్‌లోకి వెళ్తూ.

ఆ సాయంత్రం సుందర్రావు ఆఫీసు నుంచి వస్తుంటే దారిలో అతని దూరపు చుట్టం కనిపించాడు. వెళ్ళిపోతున్న వాడిని పిలిచి మాటల్లో పెట్టాడు. కొంత సేపు అదీ, ఇదీ మాట్లాడాక "నీకిది తెలుసా? తెలిసే ఉంటుందిలే. ఎంతయినా కన్నకొడుకువి. చెట్టంత కొడుక్కి చెప్పకుండా ఏ తండ్రీ ఇలాంటి పనులు చెయ్యలేడు. ఇంతకీ నువ్వెలా ఒప్పుకున్నావ్?" అన్నాడు.

సుందర్రావు ఆశ్చర్యపోయాడు. తమ తండ్రీ కొడుకుల అనుబంధం బంధువులందరూ ఎరిగిందే. ఏదో జరిగుంటుంది అనుకొని "ఏవిటి?" అన్నాడు సుందర్రావు.

"అయితే నీకు తెలీదా?" ఆయన సుందర్రావు ముఖం చూసి అతనికి తెలీదన్న సంగతి రూఢికాగానే, "నిజంగా నీకు తెలీదన్నమాట! మీ నాన్న ఎవత్తెనో తెచ్చి ఇంట్లో ఉంచుకున్నాడు. నీ కింకా తెలుసనుకున్నాను. సరే. ఇప్పటికైనా మించి పోయింది లేదు. వెంటనే వెళ్ళి నలుగురు పెద్దల్నీ కూడగట్టుకుని వాళ్ళచేత చివాట్లెట్టించు. ఆస్తంతా దానికి రాసెయ్యక ముందే జాగ్రత్తపడు" అంటూ హెచ్చరించి వెళ్ళిపోయాడు.

అప్పట్నుంచీ సుందర్రావుకు ఏం చెయ్యడానికీ పాలు పోవడంలేదు. మనసు పరిపరి విధాల పోయింది. ఒకసారి స్వయంగా వెళ్ళి వస్తే పరిస్థితి అర్థమవుతుందని ఈ ప్రయాణం పెట్టుకున్నాడు.

☆ ☆ ☆

సుందర్రావు స్నానం చేసి, బట్టలేసుకుని సుశీలకు జాగ్రత్తలు చెప్పి, సూట్‌కేసు

పట్టుకుని వీధిలోకి నడిచాడు.

"ఛఛ, అరవై ఏళ్ళ వయసులో ఆయనకిదేం పని" అనుకున్నాడు సుందర్రావు. అతనికి తండ్రిమీద కోపం అంతకంతకూ పెరిగిపోతోంది.

"నయమే, నాన్న పెళ్ళి చేసుకున్నాడని చెప్పాను సుశీలతో, ఎవత్తినో ఉంచుకున్నాడని చెప్పడానికి మనస్కరించలేదు" అనుకుంటూ బస్‌స్టాండ్‌కు వెళ్ళాడు.

ఓ పావుగంటకు బస్సు వచ్చింది. సుందర్రావు సీటులో కూచుని కళ్ళు మూసుకున్నాడు. బస్సు నగరం నడిబొడ్డునుంచి కదిలింది.

సుందర్రావు టైమ్ చూశాడు. రాత్రి ఏడు గంటలైంది. బయటకు చూశాడు. విశాఖపట్నం రంగు రంగుల దీపాలతో మెరిసిపోతోంది. మెరిసిపోతున్న నగరం ముస్తాబైన వెలయాలిలా అనిపించింది అతనికి. అంటే పల్లెటూళ్ళనుంచి బతుకు తెరువు కోసం పట్నమొచ్చిన తమలాంటి వాళ్ళంతా విటులా? ఈ ఆలోచనలు అతనికి నచ్చలేదు. దాంతో తండ్రి గురించి మళ్ళీ ఆలోచించడం మొదలెట్టాడు.

'నాన్నకిదేం పోయేకాలం! నలుగురూ ఏమనుకుంటారని అయినా ఆయనకు అనిపించలేదా? ఆయన ఉంచుకున్నది నంగనాచి అయుంటే ఈపాటికి తమకున్న అయిదెకరాలూ తనపేర రాయించుకునే ఉంటుంది. ఇల్లైనా నాన్నపేర ఉందో లేదో? చడీ చప్పుడూ కాకుండా నాన్న ఎంత పనిచేశాడు! పెళ్ళి చేసుకుని ఉండడు. పెళ్ళి చేసుకుని వుంటే ఆ విషయం పెళ్ళికి ముందో, ఆ తర్వాతో తనకు తెలిపివుండేవాడు.'

బస్సు నగరం విడిచి పల్లెటూళ్ళమీదుగా వెళ్తోంది. సూపర్ డీలక్స్ బస్సు రెండెడ్ల బండిలా నడుస్తోంది. బస్సు సూపర్ డీలక్స్ అయినా రోడ్డు మాత్రం సూపరూ కాదు, డీలక్సూ కాదు. గతుకుల మయంగా ఉంది. ఏదో ఊరొచ్చింది. వీధిలైటు వెలుగు పడినంతమేరా పంటకొచ్చిన పొలాలు బంగారు తీగల గుట్టల్లా ఉన్నాయి. భుజాలమీద తనను కూర్చోపెట్టుకుని పొలానికి తీసుకెళ్తున్న నాన్న కళ్ళముందు కదిలాడు. నాన్న ముద్దు పెట్టుకున్నప్పుడు గుచ్చుకున్న గడ్డం స్పర్శ... ముసురుతున్న తీపి జ్ఞాపకాలు సుందర్రావుకు చేదుమాత్రల్లా అనిపించాయి.

అంత మంచి నాన్న ఇలా ఎందుకు చేశాడు? అమ్మ అయినా గుర్తు రాలేదా? అమ్మ పోయి అయిదేళ్ళవుతోంది. అప్పుడామెకు ఏభై ఏళ్ళు. అమ్మ, నాన్న ఎంత అన్యోన్యంగా ఉండేవారనీ!

నెల్నాళ్ళపాటు మంచంమీదున్న అమ్మ ఓనాడు కడుపులో గాబరాగా ఉందనీ, పొలం వెళ్ళి నాన్నను తీసుకురమ్మనీ తొందర పెట్టింది. తను గబగబా పొలం వెళ్ళి నాన్నను తీసుకువచ్చాడు. నాన్న దగ్గరకు రాగానే 'ఏమండీ' అంటూ చెయ్యి పట్టుకుంది. "నేనింక బతకనండీ! నే పోతే మీ కెలా జరుగుతుందో ఏవిటో!" అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

"ఛ. అవేం మాటలు?" అన్నాడు నాన్న గద్గద స్వరంతో.

అమ్మ పోయేముందు "నాన్న జాగ్రత్త, నాన్న జాగ్రత్త" అని చిన్నపిల్ల వాణ్ణి అప్పగించినట్టు తనకూ, కోడలికీ అప్పగించింది.

సుందర్రావు నెమ్మదిగా నిద్రలోకి జారిపోయాడు. బస్సాగినప్పుడు ఉలిక్కిపడి, లేస్తూ, మళ్ళీ కునికిపాట్లు పడుతూ తెల్లవార్లూ గడిపాడు.

అతను బస్సు దిగేటప్పటికి ఇంకా మంచు పడుతోంది. రోడ్డు పక్కనున్న పచ్చని మామిడి చెట్టు స్నానం చేసి ఒళ్ళు తుడుచుకోకుండా చీర చుట్టబెట్టుకున్న మగువలా ఉంది. గాలి చల్లచల్లగా హాయి హాయిగా ఉంది.

మామిడి చెట్టు కింద ఓ జట్కా బండి కనిపించగానే సుందర్రావు, నడక బాధ తప్పిందనుకున్నాడు.

సూటుకేసు పట్టుకుని నిలబడ్డ సుందర్రావును చూసి. "బండి కట్టమంటారేటి బాబూ?' అని జట్కావాలా అడిగాడు.

బేరం కుదిరింది, సుందర్రావు గుర్రబ్బండి ఎక్కాడు. జట్కావాలా కబుర్లు చెబుతూ బండి తోలుతున్నాడు. సుందర్రావు తన తండ్రి గురించి కూపీలాగుదామా అని అనుకున్నాడు. మళ్ళీ అంతలో అది మంచి పనికాదనీ, జట్కావాలా ముందు తనకు చిన్నతనమనీ అనిపించి ఆ ఆలోచన విరమించుకున్నాడు.

సూర్యకిరణాలు లేత లేతగా ఉండి, సుందర్రావుకు గోరువెచ్చగా తగులుతున్నాయి. గుర్రబ్బండి గోతుల్లో పడుతూ, లేస్తూ నెమ్మదిగా వెళ్తోంది.

సుందర్రావు ఇంటి ముందు బండి దిగేటప్పటికి ఉదయం తొమ్మిది గంటలైంది. జట్కావాలాకు డబ్బులిచ్చి పంపేసి తమ ఇంటివైపు చూస్తూ ఉండిపోయాడు సుందర్రావు. వయస్సు మళ్ళిన ముత్తయిదువులా ఉంది ఆ ఇల్లు. ఆ ఇంట్లో దాదాపు ఇరవై ఏళ్ళున్నాడు తను. వచ్చేపోయే చుట్టపక్కాలతో ఇల్లు ఎప్పుడూ కళకళలాడుతూ ఉండేది.

అమ్మ విసుగు అనేది లేకుండా ఎంతమంది చుట్టాలున్నా వంటావార్పు చేసేది. అందరికీ కొసరి కొసరి వడ్డించేది. తనకేది కావలసినా అమ్మనే అడిగేవాడు. అమ్మ నాన్నకు సిఫార్సు చేసేది. డిమాండ్ చేసేది. అమ్మలేని ఇంట్లోకి ఇప్పుడు వెళ్ళాలి. నాన్న తెచ్చిన "ఆవిడ"ను అమ్మస్థానంలో చూడాలి. సుందర్రావుకు ఇంట్లో కెళ్ళాలనిపించలేదు. కానీ తప్పదు. ఇంతవరకూ వచ్చి ఆగిపోవడమేమిటని జారేసి ఉన్న వీధి తలుపు తోసుకుని, తలొంచుకుని నడుస్తూ లోపలికెళ్ళాడు.

తలుపు చప్పుడుకు "ఎవరూ?" అంటూ పడక గదిలోంచి వచ్చింది సత్యవతి.

ఆమె అప్పుడే ఉదయం ముస్తాబు పూర్తిచేసుకుని బయటికొస్తున్నట్టుంది.

సుందర్రావు తలెత్తి చూశాడు.

తెల్లగా, కాస్త లావుగా, అక్కడక్కడ నెరిసిన తలతో.... వయసు నలభై పైనే ఉండొచ్చు.

"ఎవరు కావాలండీ?"

"నా పేరు సుందర్రావు" అన్నాడు గట్టిగా, చిరాకుగా, అనవసరంగా గొంతు పెంచుతూ, మనిషి బిగుసుకుపోతూ.

ఆ పేరు వినగానే సత్యవతి అతనెవరో గ్రహించేసింది.

"బాగున్నావా బాబూ? ఈ పేద తల్లిని చూడాలని నీ కిప్పటికనిపించిందన్న మాట! లోపలికి రా. కోడలు కులాసాగా ఉందా?"

తల్లి, కోడలు, కొడుకు-ఓహో! ఏం వరసలు. ఏం అభిమానం. ఎంత నంగనాచి తనం.

సుందర్రావు కోపంగా సత్యవతి వంక చూసి "నాన్నగారేరీ?" అన్నాడు.

అతని ధోరణికి కాస్త బాధపడి మళ్ళీ అంతలోనే తేరుకుని "ఇప్పుడే భోంచేసి పొలం వెళ్ళారు. స్నానం చేస్తావా? నీకూ వడ్డించేస్తాను."

"అక్కర్లేదు" అని, సూట్‌కేసు గడప దగ్గరపెట్టి వెనుతిరిగాడు సుందర్రావు.

"ఆగు బాబూ!" అంటూ సత్యవతి గబగబా సుందర్రావు ముందుకొచ్చి నిలబడింది.

ఆమె కళ్ళల్లో నీళ్ళు చూసేటప్పటికి సుందర్రావుకు మరీ కోపం వచ్చింది.

"అడ్డులే నే వెళ్ళాలి."

"నా మీద నీకు చాలా కోపంగా ఉన్నట్టుంది. అందుకే భోజనం చెయ్యనంటున్నావ్!"

"నీ నటనలు కట్టిపెట్టు" అనబోయి నిభాయించుకుని "తప్పుకో నాన్న దగ్గరి కెళ్ళాలి" అంటూ తనే తప్పుకుని వీధిలోకి నడిచాడు సుందర్రావు.

ఆమెను బాధపెట్టినందుకు సుందర్రావుకు కొంచెంఆనందం కలిగింది. మొసలి కన్నీళ్ళతో తనను కరిగించేయాలనుకుంది. ఆమెకి బాగా బుద్ధి చెప్పాడు తను.

సుందర్రావు తలొంచుకుని కంకర రోడ్డు మీద నడుస్తున్నాడు. ఎండలో కంకర రోడ్డు ఎర్రగా, సుందర్రావు ముఖంలా ఉంది.

"ఏం అల్లుడూ? ఎప్పుడొచ్చావ్?" అన్నమాటలు విని, అటు చూసి "ఇప్పుడే వచ్చాను" అన్నాడు.

"పొలం వెళ్తున్నావా?"

"అవును మావయ్యా. సాయంత్రం కలుస్తాను. వస్తాను" అని ముందుకు నడిచాడు సుందర్రావు.

'మావయ్య దగ్గర ఆగవలసిందేమో. ఏమన్నా వివరాలు తెలిసేవి. ఎందుకు లెద్దూ. అసలే వెటకారం మనిషి! ఇప్పుడెన్ని వెటకారాలైనా ఆడవచ్చు. ఆగకుండా వచ్చెయ్యడమే మంచిదయింది" అనుకుంటూ సుందర్రావు ఊరు దాటి చేలగట్ల మీద నడుస్తున్నాడు.

ఈ చేలల్లో ఎంతెలా తిరిగేవాడు తను! కందికాయలు కోసుకుని ఈ పక్కనే కదూ కాల్చుకు తినేవాడు! ఆ తాడి చెట్టు పళ్ళు ఎంత తీపో! ఓ సారి ముంజికాయలు కావాలన్నాడు. పాలికావు జ్వరం వచ్చి పన్లోకి రాలేదు. తనేమో పేచీ పెట్టేశాడు ఇప్పుడే కావాలంటూ. అప్పుడు నాన్నే తాటి చెట్టెక్కి ముంజికాయల గెలలు కోశాడు. తను చాలనే వరకూ ముంజికాయలు కొట్టి పెట్టాడు.

అలాంటి నాన్న దగ్గర తానిప్పుడు గట్టిగా మాట్లాడగలడా? తప్పదు. నిర్మొహమాటంగా నిలదీయ వలసిందే. ఇదేమన్నా చిన్న విషయమా? సిగ్గులేని పని చేశాక నాన్న గొప్పేమిటి? సుందర్రావు పొలం మధ్య ఉన్న పాక చేరాడు.

"సుందరం, ఊరి నుంచి వచ్చి ఎంత సేపైందిరా? కోడలు బావుందా? బుజ్జిగాడెలా ఉన్నాడు?" చిరునవ్వుతో ఆప్యాయంగా అడిగాడు భద్రయ్య.

"అంతా బాగానే ఉన్నారు" అన్నాడు సుందరం ముక్తసరిగా.

"మంచి సమయానికే వచ్చావు. ఇందాకే మన అవు ఈనింది. నీకు జున్ను అంటే చాలా ఇష్టంకదా! గిత్తదూడ మంచి అందంగా ఉంది. చూద్దువుగాని రా!"

"గిత్తదూడను చూడడానికేముందిగాని, నువ్వు చేసిన పనేమైనా బావుందా?"

"ఏం చేశాను?"

"ఆవిడెవర్నో తెచ్చి ఇంట్లో పెట్టుకోవడం ఏమన్నా బాగుందా అని అడుగుతున్నాను" నేనుంచుకోలేదు. పెళ్ళి చేసుకున్నాను. నన్ను ఈ విషయం గురించి అడిగే అధికారం నీకు లేదనుకుంటాను" అన్నాడు భద్రయ్య.

సుందర్రావు ముఖం కందగడ్డలా అయిపోయింది.

"తండ్రి తప్పుచేస్తే నిలదీసే అధికారం కొడుక్కి ఉందనే నేననుకుంటున్నాను."

"ఎవరైనా ఏదైనా అనుకోవచ్చు. అయితే, అధికారాలు, బాధ్యతలు ఎరిగి ప్రవర్తించే వాళ్ళకే ఉంటాయి. నిన్ను పెంచడంలో గానీ, నీ అవసరాలు తీర్చడంలో గానీ నేనెప్పుడైనా నిర్లక్ష్యం చేశానా? అఖరికి నీ పెళ్ళి కూడా నువ్వు ఇష్టపడ్డ అమ్మాయితోనే జరిపించాను. ఇవన్నీ చెయ్యడం గొప్పేంకాదు. తండ్రిగా నా బాధ్యత. నువ్వు సుఖంగా ఉండటమే నేను కోరుకునేది. మరి నువ్వో? కోడల్ని తప్పుపట్టను. పరాయింటి పిల్ల. నేను మీతో ఉండటం ఆమెకు ఇష్టం లేకపోవచ్చు. కానీ, నువ్వుమాత్రం ఆమెను నీ దారిలోకి తీసుకురావడం మాని, నువ్వే ఆమె దారిలోకి వెళ్ళావు."

"అవన్నీ ఇప్పుడెందుకు?"

"సందర్భం వచ్చింది కాబట్టే చెబుతున్నాను. ఈ మాటలన్నీ నేను నన్ను ఒంటరిగా వదిలేసినప్పుడు అనుండవలసింది. అయితే, మీరైనా సుఖంగా ఉంటే అదే చాలనుకుని ఊరుకున్నాను" అని భద్రయ్య పాల తపేలా పట్టుకుని పాకలోకి వెళ్ళిపోయాడు.

సుందర్రావు తండ్రి వెళ్ళిన వైపే చూస్తూ ఉండిపోయాడు.

తల్లి చనిపోయాక, తండ్రిని తమతో ఉందువుగాని రమ్మని పట్నం తీసుకెళ్ళాడు తను. తండ్రి చుట్టలు ఎక్కువగానే కాలుస్తాడు. ఆ చుట్ట పొగ సుశీలకు కడుపులో తిప్పేసేది. కొంతకాలం చెవిలో చెప్పినట్టు నెమ్మదిగా తనతో అనేది. తరువాత తరువాత సణగడం, 'ఇల్లంతా కంపు బాబూ' అని గట్టిగానే అనడం మొదలెట్టింది. చుట్ట కాలుస్తూ మధ్యమధ్య కాండ్రించి ఉమ్మేసేవాడు నాన్న. సుశీలకది వెలపరంగా ఉండేది.

"పల్లెటూరు మనుషులూ, అలగా బుద్ధులూనూ" అని తన దగ్గర అన్నప్పుడు,

సుశీలకు నచ్చజెప్పడానికి తను ఎంతో ప్రయత్నించాడు. "బుజ్జిగాడు ఉచ్చపోసినా, దొడ్డికెళ్ళినా అసహ్యించుకోకుండా వాడిని సాకడం లేదా నువ్వు? అలాగే నాన్న పనులూ అలవాటు చేసుకోవాలి" చెప్పాడు తను. తను చెప్పేది విన్నట్టేవిని మళ్ళీ మొదటికొచ్చేది.

పట్నంలో నాన్న తమ దగ్గరున్న కాలంలో సుశీల తరచూ పుట్టింటి కెళ్ళిపోయేది. ఇక తప్పక నాన్నను 'మన ఊళ్ళో కొంతకాలం ఉండరాదా' అని అతికష్టం మీద అనవలసి వచ్చింది. తండ్రి తమ ఊరికి వెళ్ళాక, పట్నం రమ్మని మళ్ళీ అడగలేక పోయాడు తను.

ఆలోచనలకు అడ్డుకట్ట వేసి సుందర్రావు కూడా పాకలోకి వెళ్ళాడు. లేగదూడ ముచ్చటగా ఉంది. తెల్లని తెలుపు. ముఖం మీద రెండు నల్లమచ్చలు. లేగదూడను ప్రేమగా నాకుతోంది ఆవు.

భద్రయ్య పాలు తీసి, తపేలా పట్టుకుని పాక బయటకు వచ్చాడు. అపక్కనే ఉన్న దిమ్మమీద పాల తపేలా ఉంచి కూర్చున్నాడు భద్రయ్య. అతనికి కొంచెం దూరంలో సుందర్రావు కూడా కూర్చుని, "అయితే, నా మీద కోపంతో ఇలా చేశావా?" అన్నాడు సుందర్రావు.

భద్రయ్య కొడుకు కేసి ఓసారి చూసి "నీమీద కోపమేవిటి? అవసరం కొద్దీ చేశాను. నా వంట నేను చేసుకుంటూ, పొలం పనులు చూసుకుంటూ ఒంటరిగా ఇంట్లో బిక్కు బిక్కుమని సంవత్సరాల తరబడి ఉండి ఉండి ఇక ఓపికలేక ఆమెను పెళ్ళి చేసుకున్నాను. ఒంటరితనం ఎంత దుర్భరమో అనుభవించిన వాళ్లకుగాని తెలీదు. మరో విషయం. మేం కొవ్వెక్కి పెళ్లి చేసుకోలేదు. నిరుపేదరికం ఆమెను నిర్భాగ్యురాలిని చేసింది. వయసు ముదిరిపోయిన ఆమెకిక పెళ్లికాదనే అంతా అనుకున్నారు. నాకు తోడు కావాలి. ఆమెకు తిండీ,నీడ కావాలి. ఇవే మా పెళ్లికి దారితీశాయి."

తండ్రి చెబుతున్న మాటలుసుందర్రావుకు వినిపించీ వినపించనట్టున్నాయి.

"ఒంటరి తనం అనుభవించిన వాళ్లకు గానీ తెలియదు" అన్న తండ్రి మాట అతని చెవుల దగ్గర కందిరీగలా రొదపెట్టింది.

ఒంటరి తనం తనకూ తెలుసు. కాలేజీలో చదివేటప్పుడు పట్నంలో తను ఒంటరిగానే ఉండే వాడు. పగలంతా కాలేజీ, సాయంత్రమయ్యాక స్నేహితులతో

కాలక్షేపం. హోటల్లో భోజనం. నిజానికది ఒంటరితనం కాదు.అయినా, నెలకోసారైనా తల్లినీ తండ్రినీ చూడకపోతే తోచేదికాదు. సుశీల ప్రసవానికి పుట్టింటికెళ్లినప్పుడు మధ్య మధ్య పదేసి రోజులు, పదిహేనేసి రోజులూ - హోటల్లో భోజనం. కాసేపు స్నేహితులతో కబుర్లు,ఇంట్లో ఒక్కడికీ బోరు. సుశీల ఎప్పుడువస్తుందా అని ఎదురుచూడడం. సుశీల ఊరికెళ్లిన మూడు, నాలుగు రోజుల వరకు ఎలాగో గడిపినా, ఆ తరువాత ఏదో దిగులు. పుస్తకాలు చదువుతూ కాలక్షేపం చేసినా, మిత్రులతో సినిమాకెళ్లినా ఒంటరిగా వుండడం కష్టంగానే ఉండేది. అంతెందుకూ, రెండు నెలల క్రితం సుశీల పుట్టింటికెళ్లి ఇరవై రోజుల వరకూ రాలేదు. ఆ సమయంలో తనకు జ్వరం వచ్చింది. 'అదే తగ్గుతుందిలే' అనుకుంటే, నాలుగు రోజులైనా తగ్గలేదు. మందులు టైమ్‌కు వాడేవాడుకాదు. గుర్తుండేవి కావు. జ్వరంతోపాటు తలపోటు.

రాత్రప్పుడు మనసులో ఏదో గుబులు. ఓదార్పుకోసం, చల్లని చేతి స్పర్శకోసం ఎంత ఆరాటపడిపోయాడు తను! సుశీలను వెంటనే రమ్మని టెలిగ్రామ్ ఇచ్చాడు. టెలిగ్రామ్ ఇచ్చాక, ఆమె రాకకోసం క్షణమొక యుగంలా గడిపాడు. రాత్రుళ్ళు పీడకలలు. లోయలు, పాయలు. కొండశిఖరంమీంచి లోయలోకి పడిపోయినట్టు, రక్తం ముద్దలా అయిపోయినట్టు - నదుల పాయల్లోని సుడిగుండంలో ఊపిరాడక గిరగిరా తిరిగిపోతూ ఉబ్బిపోయిన శవంలా అయిపోయినట్టు...... అబ్బ! మెలకువ వచ్చాక మరీ బెంగ. చీకటి, ఒంటినిండా చెమటలు. కంటినిండా ధారలు. 'సుశీల వచ్చేదాకా వుంటానా' అనిపించింది. ఆమె వచ్చాక కానీ తనకు ధైర్యం కలగలేదు. "సుశీలా నన్ను విడిచిపెట్టి వెళ్లవుకదూ?" అన్నాడు తను కన్నీళ్ళు పెట్టుకుంటూ. మళ్ళీ మామూలు మనిషయ్యాక, 'ఛఛ,మరీ అంత బేలగా అయిపోయానేమిటి?' అని ఆశ్చర్యపోయాడుకూడా.

కొన్ని రోజుల ఒంటరి తనానికే తను అలాగైపోతే మరి నాన్న? కొన్ని సంవత్సరాలుగా ఒంటరిగా గడుపుతున్న నాన్న గురించి తనెందుకు ఆలోచించలేక పోయాడు? నేనూ, నాకుటుంబం అన్న స్వార్ధం వల్లనే? ఇప్పుడాయన వయసు అరవై. కనీసం ఇంకో ఇరవై ఏళ్ళు బ్రతికినా, అంతకాలం ఒంటరిగా ఉండమనడం శిక్ష కాదా?

సుందర్రావు తండ్రి వంక చూశాడు. ముఖంలో ఒకటి రెండు ముడతలు, కొంచెం బట్టతల.

భద్రయ్య చుట్ట చుట్టుకుని, నోట్లో పెట్టుకుని, అగ్గిపుల్లతో వెలిగించి, కొడుకు వంకచూసి "నడు, ఇంటికి పోదాం" అన్నాడు.

పాల తపేలా పట్టుకుని గుప్పుగుప్పుమని చుట్టపొగ వదులుతూ పొలం గట్టుమీద నడుస్తున్నాడు భద్రయ్య. అతని వెనకాల సుందర్రావు నడుస్తున్నాడు.

ఆమె ఎంత బాధ పడిందో! ఆమెను తను 'అమ్మా' అని పిలవగలడా? అసాధ్యం. మరెలా? అభిమానంగా చూడడానికి ప్రయత్నించాలి.

"సుందరం, మళ్ళీ ప్రమోషను వచ్చిందా?"

"మళ్ళీ రాలేదునాన్నా. రెండేళ్లగా అయింది ప్రమోషనొచ్చి!"

"కష్టపడే వాళ్ళకు ఎప్పుడూ మంచి ఫలితాలే వస్తాయిరా!"

నాన్న ఎప్పుడూ ఇంతే. శ్రమ మీద ఆయన కెంత నమ్మకమో! తమకున్న ఆస్తి అంతా నాన్న స్వార్జితమే. నాన్నది ఎప్పుడూ సూటి ఆలోచన. ఆయన సాధారణంగా తప్పుచేయడు. లోకం కోసం నాన్న ఏనాడూ బతకలేదు. పైవాళ్ళకోసం తన పద్ధతి మార్చుకోడు.

"సుందరం, ఇటువైపునున్న మూడెకరాలూ నా అనంతరం నీకు చెందేలా విల్లు రాశాను. మన పాక దగ్గరి రెండెకరాలూ, మన ఇల్లూ సత్యవతి పేర రాశాను. నేను పోయాక ఆమెను మీరు చూస్తే, ఆ ఆస్తి మీకే చెందుతుంది. మీతో ఉంచుకోవడం మీకిష్టం లేకపోతే ఆమె ఎవర్నన్నా పెంచుకోవడమో, తోడును వెదుక్కోవడమో అప్పటి పరిస్థితులను బట్టి నిర్ణయించుకుంటుంది." అంటూ ఇంటి మెట్లెక్కాడు భద్రయ్య.

"సత్యవతీ" అనిపిలిచి, ఎదురుగా వచ్చిన ఆమెకు పాల తపేలా అందించి "సుందరానికి నీళ్ళు పెట్టు. స్నానం చేస్తాడు. వంటచెయ్యాలా?" అన్నాడు భద్రయ్య.

"అక్కర్లేదు. నేనింకా తినలేదు. అయినా ఎంత సేపూ?" అంది సత్యవతి ప్రసన్నంగా ఉన్న తండ్రీ కొడుకుల ముఖాలు చూసి.

సుందర్రావు మౌనంగా ముందుగదిలోకి వెళ్ళి, చొక్కా విప్పాడు స్నానానికి తయారవుతూ.

*(ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం 7.9.1986.)*